క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను కలిసిన నర్సింగ్ సూపరింటెండెంట్ వెంకట తులశమ్మ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1గా వెంకట తులశమ్మ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. దాదాపు 27 సంవత్సరాల పాటు ఇదే ఆసుపత్రిలో వివిధ విభాగాల్లో స్టాఫ్‌నర్సుగా, హెడ్‌నర్సుగా, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2గా విధులు నిర్వహించిన ఆమె గతంలో గుంటూరు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు బదిలీ అయ్యారు. ఇప్పుడు మళ్లీ కర్నూలులో బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆమె ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు నర్సింగ్ సూపరింటెండెంట్లు గ్రేడ్-2 సావిత్రిబాయి, నాగమణితోపాటు స్టాఫ్‌నర్సులు సీహెచ్ లిల్లీ, హెడ్‌నర్సులు తదితరులు అభినందనలు తెలిపారు.

4న జిల్లా ఒలంపిక్ సంఘం సమావేశం

కర్నూలు (టౌన్): ఈ నెల 4వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా ఒలంపిక్ సంఘం సర్వసభ్య సమావేశం,ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఒలంపిక్ సంఘం కార్యదర్శి రామాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని గుర్తింపు పొందిన అన్ని క్రీడా సంఘాలు ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

4న సైక్లింగ్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈ నెల 4వ తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా స్థాయి సైక్లింగ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి లక్ష్మయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో ఈ ఎంపికలు ఉంటాయన్నారు.

అధ్యాపకురాలికి డాక్టరేట్



నఖత్ పర్వీన్

కర్నూలు కల్చరల్: కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆంగ్ల అధ్యాపకురాలు నఖత్ పర్వీన్ డాక్టరేట్ డిగ్రీ పొందారు. ఈమేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరా శాంతి ఒక ప్రకటనలో తెలిపారు. నఖత్ పర్వీన్ 'నావల్స్ ఆఫ్ పాల్ మార్షల్ ఏ స్టడీ' అనే అంశంపై తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి ఆచార్య వి.రవినాయుడు పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ పట్టా పొందారు. డాక్టరేట్ అందుకున్న ఆమెకు కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యోగాల్లోకి తీసుకోవాలని ధర్నా

కర్నూలు(సెంట్రల్): కర్నూలు పెద్దాసుపత్రిలో దాదాపు 20ఏళ్లపాటు పనిచేసిన 108 ఉద్యోగులను తొలగించడం అన్యాయమని, వారందరినీ తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఉద్యోగాలు కోల్పోయిన వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..307 రోజులు తమను ఉద్యోగాల్లోకి తీసుకోవాలని తొలగించిన వారు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. త్రీమెన్ కమిటీ నివేదికను కలెక్టర్ పక్కన బెట్టడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్ మాణిక్యం, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బీమాను సద్వినియోగం చేసుకోండి

ఓర్వకల్లు: తపాలాశాఖ అమలు చేస్తున్న జీవిత బీమా సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు కోరారు. తపాలా బీమా ఆవిర్భావ వేడుకలను బుధవారం స్థానిక పొదుపు భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ 18 ఏళ్లు పైబడిన ప్రతి పౌరుడు బీమా చేసుకోవాలన్నారు. దీని వల్ల భవిష్యత్‌కు భరోసా ఉంటుందన్నారు. అనంతరం అత్యధిక బీమా పాలసీలు చేసిన పోస్టల్ సిబ్బందికి బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వివిధ డివిజన్లకు చెందిన డీపీఎంలు, ఓర్వకల్లు, బేతంచెర్ల, కర్నూలు కృష్ణానగర్‌కు చెందిన ఎస్‌పీఎంలు మల్లికార్జున, స్వామినాయక్, తులసీకృష్ణ పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

- ఎస్వీసీ కాంప్లెక్స్ : పఠాన్ , వీర సింహారెడ్డి, వాల్తేరు వీరయ్య, వారసుడు
- వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : వీర సింహారెడ్డి ,వాల్తేరు వీరయ్య, మాలికాప్పురం, వారసుడు , హంట్, సింధూరం, రైటర్ పద్మభూషణం
- వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : వాల్తేరు వీరయ్య
- ఐనాక్స్ : అవతార్ ది వే ఆఫ్ వాటర్, పఠాన్, గాంధీ గాడ్సే ఏక్ యుద్ధ్, బీటీఎస్ యెట్ టు కమ్ ఇన్ సినిమా
- భరత్ కాంప్లెక్స్ : ధమాకా, పఠాన్
- రాజ్ : కల్యాణం కమనీయం
- శ్రీరామ : వాల్తేరు వీరయ్య
- విజయ : పఠాన్

కిల్లర్ ట్రీ.. 'కోనో కార్పస్'

- పుప్పొడితో అలర్జీ, ఆస్తమా
- భూగర్భ జలాలతోపాటు ఆక్సిజన్ హరింపు
- నగరంలో పలు చోట్ల దర్శనమిస్తున్న చెట్లు





ఈ తాండ్రపాడులో రాయలసీమ ఆల్కాలీస్ ఫ్యాక్టరీ చుట్టూ ఏపుగా పెరిగిన కోనో కార్పస్ చెట్లు, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కోనో కార్పస్ చెట్లు

కర్నూలు (న్యూటౌన్): ప్రజారోగ్యానికి, పర్యావరణానికి పెను ప్రమాదకరమైన కోనో కార్పస్ చెట్లు కర్నూలు నగరంలో ఎక్కడ పడితే అక్కడ దర్శనమిస్తున్నాయి. పలు దేశాలు ఐదేళ్ల క్రితమే ఈ మొక్కలను నిషేధించాయి. ఈ మొక్క పుష్పం నుంచి వెలువడే పుప్పొడితో అలర్జీ, శ్వాసకోస, ఆస్తమా సమస్యలు వస్తున్నాయని పరిశోధనల్లో తేలింది. అయితే ఈ ప్రమాదకర మొక్కలను కర్నూలు నగరంలోని ప్రధాన రహదారులతో పాటు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో, కర్నూలు మండలం ఈ తాండ్రపాడు గ్రామంలోని రాయలసీమ ఆల్కాలీస్ ఫ్యాక్టరీ చుట్టూ విచ్చలవిడిగా నాటారు. గతంలో పని చేసిన మున్సిపల్ కమిషనర్ రోడ్ల మధ్య ఈ మొక్కలను నాటించడంతో చాలా మంది ప్రజలు తమ ఇళ్ల వద్ద కూడా వీటిని నాటుకున్నారు. ప్రస్తుతం ఇవి పలు ప్రాంతాల్లో ఏపుగా పెరిగాయి. అయితే కోనో కార్పస్ చెట్లతో కలిగే అనర్థాలు ఆలస్యంగా వెలుగు చూస్తున్నాయి.

చూడ్డానికి అందంగా ఉన్నా ...

రోడ్ల మధ్యలో, వివిధ ప్రభుత్వ కార్యాలయాల సముదాయాల్లో నాటిన ఈ మొక్కలు ఏపుగా పెరగడం వల్ల పరిసరాలకు అందాన్ని ఇస్తాయి. గొడుగులా పెరిగి నీడనిస్తాయి. చూడ్డానికి అందంగా ఉన్నా ఈ కిల్లర్ చెట్లపై సీతాకోక చిలుకలు వాలవు. ఎందుకంటే ఆ చెట్టు పుప్పొడి అంతటి విషతుల్యం. ఈ మొక్కలతో కీటకాలు, పక్షులకు ఎలాంటి ఉపయోగం లేదు. ఏ జంతువు వీటి ఆకులను తినదు. ఇవి సముద్ర తీర ప్రాంతాల్లో పెరిగే మొక్క. దీని వేర్లు భూమిలోపలకి 80 మీటర్లపైనే వెళ్తాయి. ఈ వేర్లు భూగర్భ జలాలను పీల్చేస్తాయి. ఒక వేళ ఇంట్లో పెంచుకున్నట్లయితే పునాదులకి కూడా ప్రమాదమే. వీటి వేర్లు లోతుకుపోవడంతో డ్రైనేజీ లైన్లు, మంచినీటి వ్యవస్థను ధ్వంసం చేస్తాయి. ఈ మొక్కల వల్ల వాతావరణంలో ఆక్సిజన్ లెవెల్స్ తగ్గిపోయే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే అధికారులెవరూ ఈ మొక్కలు చేసే హానిని ఇంతవరకూ గుర్తించకపోవడం గమనార్హం. చాలా దేశాల్లో కోనో కార్పస్ మొక్కను నిషేధించాయి. ఇటీవలే తెలంగాణ ప్రభుత్వంతో పాటు మరికొన్ని రాష్ట్రాలు కూడా ఈ మొక్కను బ్యాన్ చేశాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోనో కార్పస్ మొక్కల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఆరోగ్యానికి హానికరం



కోనో కార్పస్ మొక్కలను అనేక దేశాలు నిషేధించాయి. ఈ మొక్కలు పెంచే ప్రాంతాల్లో ఆక్సిజన్ లెవెల్స్ పూర్తిగా తగ్గిపోతాయి. వీటి వేర్లు 80 మీటర్ల లోతుకుచొచ్చుకెళ్లి భూగర్భ జలాలను పీల్చేస్తాయి. కోనో కార్పస్ పుప్పొడి అత్యంత విషతుల్యం. ఈ చెట్లుపై సీతాకోక చిలుకలు వాలవు. అలాగే ఏ జంతువూ వీటి ఆకులను తినదు. కోనో కార్పస్ మొక్కలు ఆరోగ్యానికి హానికరం.

– కేవీ మధుసూదన్, బాటనీ లెక్చరర్, ఫర్‌మెన్ డిగ్రీ కాలేజీ

ఆదేశాలొస్తే తొలగిస్తాం



కోనో కార్పస్ మొక్కల పుప్పొడితో అనర్థాలు వస్తాయని నా దృష్టికి రాలేదు. ఉద్యాన శాఖ అధికారులతో సంప్రదిస్తాం. కోనో కార్పస్ చెట్లతో అలర్జీ, ఆస్తమా, శ్వాస కోశ వ్యాధులొస్తాయని నిర్ధారిస్తే ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే ఈ మొక్కలను కచ్చితంగా తొలగించి వాటి స్థానంలో ప్రజలకు ఎలాంటి హాని కలిగించని మొక్కలను నాటుతాం.

– భార్గవ తేజ, మున్సిపల్ కమిషనర్, కర్నూలు

జేసీని కలసిన ఎస్‌డీసీ



జేసీ రామసుందర్‌రెడ్డిని కలసిన నాగప్రసన్నలక్ష్మి

కర్నూలు(సెంట్రల్): కోనేరు రంగారావు కమిటీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులైన నాగప్రసన్న లక్ష్మి బుధవారం మర్యాదపూర్వకంగా జాయింట్ కలెక్టర్‌ఎస్.రామసుందర్‌రెడ్డిని కలిశారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆమె మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

ఆఫీసర్స్ క్లబ్‌లో ఇండోర్ షటిల్ కోర్టు ప్రారంభం

కర్నూలు: కర్నూలు బి.క్యాంప్‌లోని ఆఫీసర్స్ క్లబ్‌లో రూ.18 లక్షల నిధులతో నూతనంగా పునరుద్ధరించిన ఇండోర్ షటిల్ కోర్టును బుధవారం రాజ్యసభ మాజీ సభ్యులు టి.జి.వెంకటేష్, టీడీపీ కర్నూలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ టి.జి.భరత్‌లు ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆఫీ సర్స్ క్లబ్‌ను అందరూ వినియోగించుకుని వృద్ధిలోకి తీసుకురావాలని సూచించారు. క్లబ్‌లో సభ్యు ల సంఖ్య కూడా పెంచాలన్నారు. మనిషి జీవితంలో వ్యాయామం, క్రీడలు చాలా అవసరమన్నారు. అందుకే తాను ఎప్పుడూ క్రీడల అభివృద్ధికి, క్రీడాకారులకు సహకారం అందిస్తుంటామన్నారు. ఆఫీసర్స్ క్లబ్‌లో సభ్యుల సంఖ్య తగ్గిపోయినట్లు తెలి సిందని, అందరూ ఈ సింథటిక్ కోర్టును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి డాక్టర్ రామేశ్వరరెడ్డి, ఇన్‌చార్జ్ డాక్టర్ మాణిక్యరావు, వెంకటరంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యం

- 3న రెబల్స్ ఆఫ్ తుపాకుల గూడెం సినిమా విడుదల



మాట్లాడుతున్న సినిమా హీరో ప్రవీణ్ ఖండేలా

కర్నూలు (న్యూటౌన్): ప్రతి ఒక్కరిలో పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని రెబల్స్ ఆఫ్ తుపాకుల గూడెం సినిమా హీరో ప్రవీణ్ ఖండేలా అన్నారు. వారధి క్రియేషన్స్ నిర్మాణ సారథ్యంలో జయదేవ్ విష్ణు దర్శకత్వం వహించిన రెబల్స్ ఆఫ్ తుపాకుల గూడెం సినిమా ఈ నెల 3వ తేదీన విడుదల కానుంది. సినిమా ప్రమోషన్‌లో భాగంగా బుధవారం సాయంత్రం కర్నూలు మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సినిమా హీరో ప్రవీణ్ ఖండేలా మాట్లాడుతూ.. కోడుమూరు మండలం గోరంట్ల పోస్టు కొత్తపల్లి గ్రామానికి చెందిన తాను సీఏ వరకు చదువుకున్నానని చెప్పారు. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన తాను సినిమాలో హీరోగా చేయాలనే ఆసక్తితోనే 10వ తరగతి వరకు కోడుమూరులో చదువుకుని, ఆ పై చదువులు హైదరాబాద్‌లో పూర్తి చేశానన్నారు. రెబల్స్ ఆఫ్ తుపాకుల గూడెం సినిమాలో సుమారు 40 మంది కొత్త నటీనటులు నటించారన్నారు. ప్రధానంగా ఉద్యోగాల పేరుతో మోసపోతున్న నిరుద్యోగులను దృష్టిలో పెట్టుకుని సినిమా తీశామని తెలిపారు. ఇందులో హీరో శ్రీకాంత్ రాథోడ్ ప్రధాన పాత్ర పోషించాడని, రాయలసీమ నుంచి ఇద్దరు నటులు జ్ఞానేష్ (అనంతపురం), నాగేంద్ర (ఆదోని) డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో సినిమా చిత్రీకరణకు అందరం కలిసికట్టుగా పని చేశామని చెప్పారు. సినిమాకు సంతోష్‌మురికర్ కథ, రచన సహకారం, మణిశర్మ అందించిన సంగీతం హైలెట్‌గా నిలుస్తుందన్నారు. సినిమా మొత్తం తెలంగాణ రాష్ట్రంలో వరంగల్‌లోని అడవుల్లో చిత్రీకరించామని తెలిపారు. ఈ నెల 3న ప్రపంచ వ్యాప్తంగా, ఏపీ, తెలంగాణలలో 200 థియేటర్లలోవిడుదల చేస్తున్నామని, తెలుగు ప్రజలందరూ తమను ఆశీర్వదించి, మరెన్నో సినిమాలు తీసేందుకు ప్రోత్సాహం అందించాలని కోరారు. అనంతరం సినిమా టీజర్, పాటలను ప్రదర్శించారు.

విద్యార్థుల్లో ఆధ్యాత్మికతను పెంపొందించాలి



కంఠస్థ పోటీల విజేతలతో అతిథులు

కర్నూలు కల్చరల్: మానవుడు ఏ రంగంలో పనిచేసినా జీవిత పరమార్థం తెలుసుకుని జీవించాలని, భక్తి లేని జీవితం వ్యర్థమని విశ్రాంత జిల్లా వైద్యాధికారి డాక్టర్ పూజారి మోక్షేశ్వరుడు అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కర్నూలు నగరం సీక్యాంప్‌లోని తితిదే కల్యాణ మండపంలో భీష్మ ఏకాదశిని పురస్కరించుకునిఅచ్యుతాష్టకం, విష్ణు సహస్రనామ స్తోత్ర కంఠస్థ పఠన పోటీలను నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించి ప్రసంగించారు. విద్యార్థుల్లో ఆధ్యాత్మికతను పెంపొందించాలని సూ చించారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా తెలుగు పండితులు పసుపులేటి నీలిమ, డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని, హెచ్.సీతామహాలక్ష్మి, పురావస్తు లక్ష్మీ సుశీల రాణి, గరుడాద్రి వనజ కుమారి, సువర్ణ జోషి వ్యవహరించారు. విజేతలకు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బజరంగ్ దళ్ రాష్ట్ర కన్వీనర్ తూముకుంట ప్రతాప్‌రెడ్డి, శ్రీకూర్మ క్షేత్ర ఆలయ నిర్వాహకులు నరేష్, యోగా మాస్టర్ గాదిరాజు భానోజరావు, శ్రీవెంకటేశ్వర సంగీత నృత్య కళా నిలయం బి.మల్లీశ్వరి, కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు తూర్పాటి నారాయణ, విశ్రాంత మండల అభివృద్ధి అధికారి తుపాకుల వెంకటేశ్వర్లు, విశ్రాంత ఎస్ఐ నాగేంద్ర పాల్గొన్నారు.

విజేతలు వీరే...

విష్ణు సహస్రనామ స్తోత్ర కంఠస్థ పఠన పోటీల్లో ప్రథమ బహుమతి నిత్యశ్రీ హర్షిణి, ద్వితీయ బహుమతి బి.విశాల్‌రెడ్డి (మాంటిస్సోరి పాఠశాల), తృతీయ బహుమతి హేమంత్ నాయక్ (మదర్‌ల్యాండ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల, కొలిమిగుండ్ల). అచ్యుతాష్టకం కంఠస్థ పఠన పోటీల్లో ప్రథమ విజేత బి.ప్రవస్తి (మదర్ ల్యాండ్ పాఠశాల, కొలిమిగుండ్ల), ద్వితీయ బహుమతి ఎస్.సునంద (శ్రీలక్ష్మీ పాఠశాల), తృతీయ బహుమతి పి.గాయత్రి (మాంటిస్సోరి పాఠశాల).

టీకాలతోనే వ్యాధుల నివారణ



ఫ్రీజర్‌లోని వ్యాక్సిన్‌ను పరిశీలిస్తున్న డీఐవో డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): చిన్నారులకు వేసే వ్యాధినిరోధక టీకాలతో ప్రాణాంతక వ్యాధుల నుంచి నివారణ ఉంటుందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. బుధవారం డాక్టర్స్ కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాధినిరోధక టీకాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా యుపీహెచ్‌సీలోని డీఫ్రీజర్, ఫ్రీజర్‌లలోని టీకాలను పరిశీలించి, వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పుట్టిన ప్రతి బిడ్డకు పుట్టిన రోజు నుంచి ఐదు సంవత్సరాల వరకు తప్పనిసరిగా వయస్సు వారీగా షెడ్యూల్ ప్రకారం టీకాలు వేయించాలని, ఐరన్ సిరప్, విటమిన్-ఎ ద్రావణం డోసులు ఇప్పించాలన్నారు. వ్యాధినిరోధక టీకాలు వేస్తే క్షయ, పోలియో, కంఠసర్పి, ధనుర్వాతం, న్యూమోనియా, మెదడువాపు వ్యాధి, హెపటైటిస్-బి, తట్టు, రుబెల్లా, మీజిల్స్, రోటావైరస్ వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చన్నారు. ఆరు నెలల వరకు బిడ్డకు తల్లిపాలు మాత్రమే త్రాగించాలని తెలిపారు. ఆయన వెంట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కల్యాణ చంద్రశేఖర్, ప్రాజెక్టనిస్టు ఎస్.ఖలీల్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎస్‌పీఎం విభాగం వైద్యవిద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్

కర్నూలు(హాస్పిటల్): అకడమిక్ లీడర్‌షిప్ సదస్సులో కర్నూలు మెడికల్ కాలేజీలోని సామాజిక వైద్యవిభాగం(ఎస్‌పీఎం) పీజీ విద్యార్థులు డాక్టర్ హారిక, డాక్టర్ ఆయేషా, డాక్టర్ విష్ణుప్రియ ప్రతిభ చాటారు. కోయంబత్తూరులోని పీఎస్‌జీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రీసెర్చ్‌లో జరిగిన జాతీయ సదస్సులో మెడికల్ ఎడ్యుకేషన్‌పై వీరు తమ పోస్టర్ ప్రదర్శన చేసి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. వీరిని బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్ అభినందించారు. మెడికల్ ఎడ్యుకేషన్‌పై ఇలాగే అత్యుత్తమ ప్రదర్శనలు, రీసెర్చ్ చేసి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌పీఎం హెచ్‌వోడీ డాక్టర్ సుధాకుమారి, ప్రొఫెసర్ డాక్టర్ సింధియా శుభప్రద, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రవీణ పాల్గొన్నారు.

విజ్ఞాన నిలయాలుగా గ్రంథాలయాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్, తదితరులు

కర్నూలు(అర్బన్):జిల్లాలోని గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలుగా నిలుస్తున్నాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం సుభాష్ చంద్రబోస్ అన్నారు. బుధవారం స్థానిక బీ క్యాంప్‌లోని బీసీ భవన్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే పేరిట నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆయన ప్రారంభించారు. బీసీ జేఏసీ నాయకులు దేవపూజ ధనుంజయఆచారి, బత్తుల లక్ష్మీకాంతయ్య, హేమంత్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షురాలు, కార్పొరేటర్ సిత్రా సత్యనారాయణమ్మ, బీజేపీ జిల్లా అధ్యక్షులు పోలంకి రామస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా సుభాష్ మాట్లాడుతూ.. బీసీ భవన్‌లో గ్రంథాలయం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా పూలే గ్రంథాలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామన్నారు. తర్వాత బీజేపీ జిల్లా అధ్యక్షులు రామస్వామి, కార్పొరేటర్ సిత్రా సత్యనారాయణమ్మ, నక్కలమిట్ట శ్రీనివాసులు మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ, ప్రజా సంఘాల నాయకులు కురువ నాగేష్, చిలక రాఘవేంద్ర, చంద్రికమ్మ, అయ్యన్నయాదవ్, సురేష్‌బాబు, అవిలేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ షాపులకు బహిరంగ వేలం

- 9 షాపులకు రూ.31.89 లక్షల ఆదాయం



బహిరంగ వేలం నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలో ఖాళీగా ఉన్న మున్సిపల్ షాపులకు బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. స్థానిక కౌన్సిల్ హాలులో నిర్వహించిన ఈ వేలంలో నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ,రెవెన్యూ అధికారి జునీద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రాజేశ్వరరావు, సుహేయిల్, వాజిద్, రాజు పాల్గొన్నారు. నగరంలోని 40 షాపులకు గాను మొదటిరోజు 9 షాపులను పాటదారులు పోటీ పడి దక్కించుకున్నారు. పాతబస్టాండ్ మున్సిపల్ ఓపెన్ థియేటర్ వద్ద నిర్మించిన షాపు నంబర్ 8 షేక్ మౌలాలి(రూ.8 లక్షలు), 12వ షాపు జగన్‌మోహన్‌రావు (రూ.6 లక్షల 80 వేలు), 13వ షాపును అబ్దుల్ రహిమాన్ (6 లక్షల 25 వేలు), 14వ షాపును మునుస్వామి (రూ.3 లక్షల 50 వేలు), 15వ షాపును సయ్యద్ జాకీర్ బాషా (రూ.3లక్షల 65 వేలు)కు దక్కించుకున్నారు. అలాగే కింగ్ మార్కెట్ వద్ద ఉన్న 52/150-జె షాపును షేక్ అస్లాంబాష (రూ.3 లక్షల 69 వేలకు) దక్కించుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గురువారం సైతం షాపులకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

బైరెడ్డి సిద్ధార్థరెడ్డి కటౌట్ దగ్ధం

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్త బైరెడ్డి సిద్ధార్థరెడ్డి భారీ కటౌట్‌ను గుర్తు తెలియని వ్యక్తులు తగులబెట్టారు. స్థానిక డాక్టర్స్ కాలనీలోని ఆయన నివాసం వద్ద ఆయన అభిమానులు కటౌట్‌ను ఏర్పాటు చేశారు. అయితే మంగళవారం అర్ధరాత్రి కొందరు దీనికి నిప్పు అంటించి తగులబెట్టారు. దీంతో వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రమౌళి, ధర్మ, యువజన విభాగం నాయకులు బుధవారం స్థానిక మూడవ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



తుంగభద్రలో స్వామివారికి చక్రస్నానం నిర్వహిస్తున్న పండితులు

కర్నూలు కల్చరల్: సంకల్ బాగ్ హరిహర క్షేత్రంలో నిర్వహిస్తున్న శ్రీదేవి భూదేవి సహిత శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయ 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ధ్వజ అవరోహణ, తుంగభద్ర నదిలో చక్రస్నానంతో ఉత్సవాలు పూర్తి అయ్యాయి. రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కల్లె చంద్రశేఖరశర్మ, కార్యదర్శి హెచ్.కె. రాజశేఖర్ రావు, ఏపీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర కోశాధికారి హెచ్‌కె మనోహర రావు, కమిటీ సభ్యులు ప్రభాకర్, పార్థసారథి, రాజేష్ ప్రసాద్, సాయికుమార్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

6న లలితా పీఠం సత్సంగ వార్షికోత్సవం

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో ఈ నెల 6వ తేదీ లలితా పీఠం సత్సంగం 22వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతులు మేడా సుబ్రహ్మణ్యస్వామి తెలిపారు. సామూహిక శ్రీ లలితా సహస్రనామ పారాయణం, సామూహిక కుంకుమార్చన, విశేష పూజలు జరుగుతాయని, భక్తులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

76.78 శాతం పెన్షన్ పంపిణీ



ఓమేగా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వృద్ధురాలు పద్మావతికి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ పరిమళ

కర్నూలు (టౌన్): ఫిబ్రవరి నెలకు సంబంధించిన వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమంను కర్నూలు నగరంలోని 52 వార్డుల్లో ఉన్న 136 సచివాలయాల పరిధిలో బుధవారం తెల్లవారుజాము నుంచే చేపట్టారు. వలంటీర్లు, వెల్ఫేర్ కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు. నగరంలో మొత్తం 32 వేల 725 పెన్షన్లు ఉన్నాయి. మొదటి రోజు 23 వేల 391 పెన్షన్లు పంపిణీ చేసి 76.78 శాతం నమోదు చేశారు. మొత్తం పెన్షన్‌దారులకు రూ.6 కోట్ల57 లక్షల 51 వేల 500 పంపిణీ చేశారు. సాంకేతికపరంగా చిన్న పాటి ఇబ్బందులు వచ్చిన లబ్ధిదారులకు సకాలంలో పెన్షన్ అందజేశామని సచివాలయాల సిబ్బంది వెల్లడించారు.